సాక్షి
అనంతపురం
మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.20,100

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20,100 పలికాయి.



పెనుగాలుల బీభత్సం

గార్లదిన్నె, పామిడి మండలాల్లో సోమవారం పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల ధాటికి పలు తోటల్లో చెట్లు విరిగిపడ్డాయి.

8లో

గరిష్టం/కనిష్టం
40.7°/22.1°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస్, అగ్నిమాపక శాఖ అధికారులు

అనంతపురం: విపత్తుల సమయంలో అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయమని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ అన్నారు. సోమవారం నగరంలోని ఆ శాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభోత్సవంలో జిల్లా జడ్జి పాల్గొన్నారు. వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. 2024లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో ఫైర్ ఫైటింగ్ చేస్తూ అమరులైన సిబ్బందికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది ప్లకార్డులు చేతబట్టి నగరంలో ర్యాలీ నిర్వహించి, కరపత్రాలు పంచారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఫైర్ సర్వీస్ సిబ్బంది, అధికారులు, విశ్రాంత అధికారులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఎఫ్‌ఓ లింగమయ్య, ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఎం. భూపాల్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి వి. శ్రీనివాస రెడ్డి, ఎస్‌ఆర్ ఐటీ, బాలాజీ విద్యా సంస్థలు, ట్రిల్లీస్ స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం పదోన్నతుల సీనియార్టీ జాబితా సిద్ధం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా పరిషత్, మునిసిపాలిటీ, అనంతపురం కార్పొరేషన్‌లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించేందుకు సీనియార్టీ జాబితాను తయారు చేశారు. deoananthapuramu.blogspot.com వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే ఆధారాలతో ఈనెల 19లోపు ఫిర్యాదు చేయాలని డీఈఓ సూచించారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు



భోజనం చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం రూరల్: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహం–1, 2లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు.విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో పాల్గొనాలని, దీంతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలసి వసతి గృహంలోనే భోజనం చేశారు. కార్యక్రమంలో జేసీ శివ్‌నారాయణశర్మ, ఆర్డీఓ కేశవ నాయుడు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ (ఇన్‌చార్జ్) రాధిక తదితరులు పాల్గొన్నారు.

కొల్లగొట్టు కాంతారావ్!



నేమకల్లు వద్ద కొండను కొల్లగొడుతున్న దృశ్యం

ప్రకృతిని చెరబట్టాడు. కొండలను కరిగించేశాడు. ప్రజలపై దుమ్ము కొట్టాడు. అందిన కాడికి వెనకేసుకున్నాడు. అతని విశృంఖలత్వాన్ని చూసి అధికారులే విస్తుబోయారు. ఏకంగా రూ. 13 కోట్లకు పైగా ఫైన్ విధించారు. సదరు వ్యక్తి నుంచి ముక్కు పిండి ఆ మొత్తాన్ని వసూలు చేయాల్సి ఉండగా.. కూటమి సర్కారు మాత్రం కరుణ చూపుతోంది. మన వాడే కదా.. అని ఏకంగా జరిమానాను రద్దు చేసేలా పావులు కదుపుతోంది.

- మైనింగ్ డాన్ కాంతారావుకు కూటమి సర్కారు దన్ను
- 2019లో వేసిన రూ.13.19 కోట్ల జరిమానాపై రివిజన్ ఉత్తర్వులు
- మాఫీ చేయాలనే తలంపుతోనే ఇలా చేస్తున్నారని విమర్శలు
- కూటమి సర్కారు వచ్చాక మళ్లీ ప్రకృతి వనరులపై పడిన ఘనుడు



క్రషర్ యూనిట్ నుంచి వెలువడుతున్న పొగ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో మైనింగ్ మాఫియా డాన్‌గా పేరుగాంచిన టీవీఎస్ కాంతారావుకు కూటమి సర్కారు దన్నుగా నిలుస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన టీవీఎస్ కాంతారావు గతంలో బొమ్మనహాళ్ మండలం నేమకల్లు కేంద్రంగా భారీ దోపిడీ సాగించారు. కొండలను కొల్లగొట్టి రూ. కోట్లు కూడగట్టారు. అక్రమంగా కంకర, గ్రావెల్‌ను ఓబులాపురం మీదుగా కర్ణాటకకు తరలించారు. ఇతనిపై ఫిర్యాదుల నేపథ్యంలో 2019లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మైనింగ్ అధికారులు నేమకల్లు వద్ద తనిఖీలు నిర్వహించారు. కాంతారావు అక్రమాలు చూసి ఆశ్చర్యపోయారు.పూర్తిస్థాయి విచారణ అనంతరం రూ.13.19 కోట్ల జరిమానా విధించారు. కానీ ఇప్పటికీ పైసా కూడా ప్రభుత్వానికి చెల్లించలేదు.

జరిమానాపై పునఃపరిశీలన..

కూటమి సర్కారు కొలువుదీరిన మూడు నెలలకే అంటే 2024 సెప్టెంబర్ 7న గతంలో కాంతారావుకు విధించిన జరిమానాను మళ్లీ పరిశీలించాలని ప్రభుత్వం జిల్లా గనుల శాఖను ఆదేశించింది. 2019లో గనులశాఖ అధికారులు స్వయంగా వారం రోజులు పరిశీలించి.. భారీగా అక్రమ మైనింగ్ జరిగిందని నిర్ధారించి... ఆ మేరకు నివేదిక ఇచ్చిన తర్వాత వేసిన జరిమానాపై పునఃపరిశీలించాలని ఆదేశాలు జారీ చేయడం చూస్తే... దాన్ని పూర్తిగా మాఫీ చేసే తలంపులో ప్రభుత్వం ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. దీనికితోడు అప్పట్లో రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద ఆస్తులు కూడా జప్తు చేయాలని, ఆ స్థాయిలో అక్రమాలు జరిగాయని ఇచ్చిన నివేదికను కాదని ఇప్పుడు మళ్లీ పరిశీలించమన్నారంటే ఏ స్థాయిలో మైనింగ్ డాన్‌కు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందో ఊహించుకోవచ్చు.

కూటమి సర్కారు రాగానే స్టార్ట్..

కాంతారావుకు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అండగా నిలుస్తున్నారని, ప్రభుత్వ ఉత్తర్వుల వెనుక ఆయన పాత్ర ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2024లో జరిగిన ఎన్నికల్లో టీడీపీకి కాంతారావు నిధులు సమకూర్చారని, అందుకే 'రివిజన్' చేస్తున్నారని టీడీపీ నాయకులే విమర్శిస్తున్నారు. బొమ్మనహాళ్ మండలం నేమకల్లు వద్ద కొండలు, గుట్టల్ని పిండి చేసి ఏళ్ల తరబడి రూ.కోట్లు దోచుకున్న కాంతారావు.. మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం రాగానే అనుమతులు లేకున్నా యథేచ్ఛగా ప్రకృతి వనరులను కొల్లగొట్టడం ప్రారంభించడం గమనార్హం. సర్కారు కొలువుదీరిన మరుసటి రోజే నేమకల్లు పరిసరాల్లో జేసీబీలు, క్రషర్లు గద్దల్లా వాలినట్లు తెలిసింది.

ఆగని 'కూటమి' కక్ష సాధింపులు

- ఉరవకొండలో మరికొందరు వైఎస్సార్ సీపీ నేతలకు పోలీసు నోటీసులు



ఉరవకొండ పోలీసు స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నేతలు

ఉరవకొండ: వైఎస్సార్ సీపీ నాయకులపై కూటమి సర్కారు కక్ష సాధింపులు కొనసాగుతున్నాయి. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ గత ఏడాది డిసెంబర్ 27న ఉరవకొండలో పోరుబాట పేరుతో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులే కాకుండా ప్రజలు కూడా కదం తొక్కడంతో కార్యక్రమం విజయవంతమైంది. ఈ క్రమంలో దీన్ని ఓర్వలేని స్థానిక టీడీపీ నేతలు విద్యుత్ అధికారిపై ఒత్తిడి చేసి కేసు పెట్టించారు. ర్యాలీతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిందంటూ ఓ 'పచ్చ' నాయకుడి ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదైంది. దీనిపై ఫిబ్రవరి 2న కొంతమంది వైఎస్సార్‌సీపీ నాయకులను పిలిచి విచారణ చేపట్టిన పోలీసులు తిరిగి సోమవారం మరో 10 మంది పార్టీ ముఖ్య నాయకులకు నోటీసులు అందించడం గమనార్హం. ఈ సందర్భంగా నోటీసులు అందుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు బసవరాజు, ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగప్రసాద్ మాట్లాడుతూ అక్రమ కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరు కొనసాగిస్తామన్నారు. ఉరవకొండలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని, మంత్రి కేశవ్ అండతో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారని విమర్శించారు. నోటీసులు అందుకున్న వారిలో ఉరవకొండ రూరల్, మండల కన్వీనర్లు ఎర్రిస్వామిరెడ్డి, మూలగిరిపల్లి ఓబన్న, నాయకులు శింగనమల్ల ఉస్మాన్, సుద్దాల వెంకటేష్, వడ్డే ఆంజినేయులు, వెలిగొండ నాగన్న, అనిల్, బూదగవి ధనంజయులు తదితరులు ఉన్నారు.

అక్రమంగా మట్టి తోలినా.. మనల్నెవడ్రా ఆపేది..?!



వడ్డుపల్లి సమీపంలో టిప్పరుతో అక్రమంగా మట్టి తరలిస్తున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'మేమేం చేసినా మమ్మల్ని అడిగేవారు లేరు.. ఆపేవారు అంతకన్నా లేరు.. అంతా మా ఇష్టం' అన్న తరహాలో ఆత్మకూరు మండలంలో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. ప్రస్తుతం ఎక్కడికైనా మట్టి తోలాలంటే ముందుగా రెవెన్యూ అధికారులు, మైనింగ్ శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అలాంటి నిబంధనలేమీ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా మట్టిని అక్రమంగా తరలిస్తూ ఓ తెలుగు తమ్ముడు జేబులు నింపుకుంటున్నాడు. ఆత్మకూరు మండలం వడ్డుపల్లి సమీపంలో టీడీపీ నాయకుడు కృష్ణమోహన్ నెల రోజుల నుంచి మట్టిని కొల్లగొడుతున్నాడు. ఇప్పటివరకూ దాదాపు 500 టిప్పర్ల వరకు అక్రమంగా మట్టి తరలించినట్లు తెలిసింది. ఒక టిప్పర్ రూ.7 వేల వరకు విక్రయిస్తూ రూ. లక్షలు వెనకేసుకుంటున్నాడు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామంలో శ్రీకృష్ణుని గుడి నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి భూమి పూజ చేయగా.. అప్పట్లో సదరు కృష్ణమోహన్ వేరే వారితో ఫోన్‌లో మాట్లాడుతూ తమ ప్రభుత్వం వస్తే గుడి కట్టినా, బడి కట్టినా కూల్చేస్తాం అన్న మాటలు పెద్ద దుమారమే లేపాయి.

చోద్యం చూస్తున్న అధికారులు..

నిత్యం వందల మట్టి టిప్పర్లు అనుమతి లేకుండా హైవేపైనే వెళ్తున్నా.. సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆత్మకూరు మండల రెవెన్యూ అధికారులకు విషయం తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

యువ కౌలు రైతు ఆత్మహత్య



చరణ్ (ఫైల్)

నార్పల: కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు... స్థానిక సుల్తాన్‌పేటకు చెందిన నాగభూషణం కుమారుడు కురువ చరణ్ (23) మామిడి తోటలను కౌలుకు తీసుకొనేవాడు. అలా ఈ ఏడాది తెలిసిన వారి దగ్గర అప్పు తీసుకుని దాదాపు 15 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. పంట బాగా వచ్చేందుకు పురుగు మందులు కొట్టడంతో పాటు కూలీలతో ఇతర పనులు చేయించాడు. అయితే, వాతావరణం అనుకూలించకపోవడంతో పంట సరిగా రాలేదు. దీనికితోడు దళారుల మోసంతో మామిడికి సరైన ధరలు కూడా దక్కలేదు. దీంతో దాదాపు రూ.20 లక్షల నష్టం వచ్చింది. ఈ క్రమంలో అప్పులు కట్టే దారి కానరాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన చరణ్ జంగంరెడ్డిపల్లి వద్ద తాను కౌలుకు తీసుకున్న మామిడితోటలో సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు వెంటనే అతడిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స ఫలించక ప్రాణాలు విడిచాడు. చరణ్ మృతదేహం వద్ద తల్లిదండ్రులు, బంధువులు గుండెలవిసేలా రోదించారు.

స్ఫూర్తిప్రదాత అంబేడ్కర్

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

అనంతపురం సిటీ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తిప్రదాత అని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా పరిషత్ క్యాంపస్‌లో గల డీపీఆర్‌సీ భవన్‌లో సోమవారం అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ వినోద్‌కుమార్, ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తదితరులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దళిత సంఘాల ప్రతినిధులు అనేక సమస్యలను తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. శ్మశాన వాటికల ఏర్పాటుపై దృష్టి పెట్టామన్నారు. బదిలీలు, పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తామని వెల్లడించారు. సబ్ ప్లాన్‌కు సంబంధించి మూడు నెలలకోసారి సమీక్ష నిర్వహిస్తామని, సివిల్ రైట్స్ డేని ఏప్రిల్ నుంచి ప్రతి తహసీల్దార్, ఎస్‌హెచ్‌ఓ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇల్లు లేని వారిని గుర్తించి న్యాయం చేస్తామన్నారు. బడుగు, బలహీన వర్గాలు రాజకీయంగా ఎదుగుతున్నారంటే అంబేడ్కర్ భిక్షేనని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. అనంతపురంలోని అంబేడ్కర్ భవనానికి రూ.12 లక్షలు ఎంపీ ల్యాడ్స్ కింద మంజూరు చేస్తున్నట్లు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. కస్తూర్బాగాంధీ గురుకులాలతో పాటు మోడల్ స్కూళ్లలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం సీట్లను పెంచేలా చూస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు. అంతకుముందు జెడ్పీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కమలమ్మ, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రోత్సాహం

విభిన్న ప్రతిభావంతులకు ప్రోత్సాహం అందిస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీ భవన్‌లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. దివ్యాంగులకు స్వయం ఉపాధి పథకం కింద రుణాలు, ఉపకరణాలు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 12 మంది విభిన్న ప్రతిభావంతులకు ఎన్‌డీఎఫ్‌డీసీ కింద రూ.27.55 లక్షల రుణాలు మంజూరైనట్లు తెలిపారు. డిగ్రీ, ఇతర వృత్తి విద్య కోర్సులు అభ్యసిస్తున్న 25 మంది విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.9.50 లక్షల విలువ చేసే ల్యాప్ ట్యాప్‌లు, నలుగురు బధిరులకు రూ.58 వేల విలువ చేసే టచ్ ఫోన్‌లు, మరో ఐదుగురికి రూ.56 వేల విలువ చేసే వీల్ చైర్లను పంపిణీ చేసినట్లు వివరించారు.

అల్ట్రాసౌండ్‌కు గంటలు... 2డీ ఎకోకు చుక్కలు



అల్ట్రాసౌండ్ స్కానింగ్ తీస్తున్న పీజీ విద్యార్థులు



స్కానింగ్ కోసం వేచి ఉన్న రోగులు



ఖాళీగా ఉన్న 2డీ ఎకో సిబ్బంది సీటు, బెడ్డుపై వేచి ఉన్న రోగి



2 డీ ఎకో గది వద్ద వేచి ఉన్న రోగులు, సహాయకులు

- తీరు మార్చుకోని సర్వజనాస్పత్రి వైద్యులు
- రోగులకు తప్పని కష్టాలు

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వంలో సర్వజనాస్పత్రిలో రోజు రోజుకు వైద్య ప్రమాణాలు సన్నగిల్లుతున్నాయి. పబ్లిక్ హాలీడే పేరుతో సోమవారం వైద్యులు, సిబ్బంది జాలీగా బయటకు వెళ్లిపోవడంతో రోగులు నరకయాతన అనుభవించారు. వేచి ఉన్న సహాయకులకు చుక్కలు కనిపించాయి. ఆస్పత్రిలోని 2డీ ఎకో, అల్ట్రాసౌండ్ స్కాన్‌లు తీవ్ర జాప్యమయ్యాయి. '2డీ ఎకో' టెక్నీషియన్ గంటల తరబడి పత్తా లేకుండా పోవడంతో రోగులు వేచి ఉండాల్సి వచ్చింది. వాస్తవంగా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారు, అత్యవసర సర్జరీ కేసులకు 2డీ ఎకో తప్పనిసరి. అటువంటి స్కాన్‌ను సకాలంలో చేయాల్సి ఉన్నా ఆ పరిస్థితి లేకుండా పోయింది. అపస్మారక స్థితిలో ఉన్న వారిని గంటల తరబడి గదుల ముందు ఉంచేశారు. 2డీ ఎకో కోసం రెండు సార్లు వార్డు నుంచి రావాల్సి వచ్చిందని శెట్టూరు మండలం మాకొడికి గ్రామానికి చెందిన చంద్రనాయక్ ఆవేదన వ్యక్తం చేశాడు.

పీజీలే దిక్కు..

సర్వజనాస్పత్రి అల్ట్రాసౌండ్ స్కాన్‌లో పీజీలే దిక్కుగా మారారు. దీనికితోడు రేడియాలజిస్టు డాక్టర్ కల్యాణ్ కానరాకపోవడంతో స్కాన్‌లు నెమ్మదిగా సాగాయి. 50 మందికిపైగా రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. విద్యార్థి దశలో ఉన్న వారి దగ్గరుండి స్కాన్‌లు ఏ విధంగా తీయాలో నేర్పించాల్సిన రేడియాలజిస్టులు విధులను నిర్లక్ష్యం చేయడం సర్వత్రా విమర్శలకు దారి తీసింది. ఇక.. డాప్లర్ స్కాన్‌కు గత మూడు రోజులుగా తిప్పుతున్నారని పూలకుంటకు చెందిన లత వాపోయింది.

మందకొడిగా రైతు రిజిస్ట్రేషన్లు

- యాప్ సరిగా పనిచేయక సిబ్బంది సతమతం
- ఇప్పటి వరకు 60 శాతం పూర్తయినట్లు వెల్లడి

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ చేపట్టిన రైతు రిజిస్ట్రేషన్ల కార్యక్రమం మందకొడిగా కొనసాగుతోంది. ఆధార్‌కార్డు మాదిరిగా ప్రతి రైతుకూ 11 నంబర్లతో కూడిన ప్రత్యేక విశిష్ట సంఖ్య (ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ) కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అయితే, ఇందులో భాగంగా తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ (ఏపీఎఫ్‌ఆర్) అగ్రి స్టాక్ యాప్ నెల రోజులుగా సక్రమంగా పని చేయడం లేదని చెబుతున్నారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించకుండా రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలంటూ వ్యవసాయశాఖ అధికారులు ఒత్తిడి చేస్తుండటంతో ఆర్‌ఎస్‌కే సిబ్బంది సతమతమవుతున్నారు. రైతు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, వాటికి అనుసంధానం అయిన మొబైల్ నంబరు ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత రైతుకు 11 నంబర్లతో కూడిన ఐడీ నంబరు కేటాయిస్తున్నారు. ఇందుకు మూడు సార్లు ఓటీపీ సక్సెస్ కావాల్సివుంటుంది. చాలా వరకు రెండు ఓటీపీలు సక్సెస్ అవుతున్నా మూడోసారి ఓటీపీ కావడం లేదని తెలిసింది. దీంతో అంతరాయం ఏర్పడుతోందని సిబ్బంది వాపోతున్నారు. భవిష్యత్తులో ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్, పావలావడ్డీ, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, యాంత్రీకరణ, రాయితీ విత్తనాలు, పంట ఉత్పత్తుల అమ్మకాలు తదితర వ్యవసాయ అనుబంధ శాఖల పరిధిలో ప్రభుత్వ ఫలాలు వర్తించాలంటే రైతుకు విశిష్ట సంఖ్య తప్పనిసరిగా ఉండాలని చెబుతున్నారు.

రెండు నెలల్లో 60 శాతమే..

జిల్లా వ్యాప్తంగా 3,42,666 మందికి విశిష్ట సంఖ్య కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 1.97 లక్షల మందికి కేటాయించారు. అంటే గత రెండు నెలలుగా చేస్తున్నా 60 శాతం పూర్తీ చేశారు. ఇంకా 40 శాతం పెండింగ్ ఉండటంతో ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే, ఆ లోపు కూడా ప్రక్రియ పూర్తి కావడం కష్టమేనని చెబుతున్నారు. ఇప్పటివరకూ పెద్దవడుగూరు మండలంలో 94 శాతం పూర్తి కావడంతో మొదటి స్థానంలో కొనసాగుతోంది. పెద్దపప్పూరులో 90 శాతం, గుత్తి 88, రాయదుర్గం 83, యాడికి 83, తాడిపత్రి 79, గుంతకల్లు 78 శాతం ఇలా కొన్ని మండలాల్లో రిజిస్ట్రేషన్లు బాగానే జరిగాయి. అయితే గుమ్మఘట్ట 33 శాతం, కుందుర్పి 36, వజ్రకరూరు 37, బుక్కరాయసముద్రం 38, బెళుగుప్ప 39, కళ్యాణదుర్గం 40 శాతం... ఇలా కొన్ని మండలాల్లో మందకొడిగా కొనసాగుతోంది.

క్లుప్తంగా

మహిళా కమిషన్ సభ్యురాలిని పరామర్శించిన వైఎస్ జగన్

గుత్తి: ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు, గుత్తి పట్టణానికి చెందిన రుఖియాబేగం ఆదివారం శ్రీకాళహస్తి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. తిరుపతిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను సోమవారం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఫోన్‌లో పరామర్శించారు. రుఖియా బేగంకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

మద్యం అడిగితే ఇవ్వలేదని వ్యక్తిపై దాడి


గాయపడిన గంగాధర్

యాడికి: తాగేందుకు మందు ఇవ్వలేదన్న అక్కసుతో ఖాళీ మద్యం బాటిళ్లతో వ్యక్తిపై దాడి చేసిన ఘటన యాడికిలో సంచలనం రేకెత్తించింది. బాధితుడు తెలిపిన మేరకు.. యాడికి మండలం కోనుప్పలపాడు గ్రామానికి చెందిన మంగల గంగాధర్ సోమవారం వ్యక్తిగత పనిపై మండల కేంద్రానికి వచ్చాడు. మధ్యాహ్నం కుంటకు వెళ్లే మార్గంలో ఉన్న బ్రాందీ షాపులో మద్యం బాటిల్ కొనుగోలు చేసి, ఆ పక్కనే మిగిలిన వారితో కలసి తాగుతూ కూర్చొన్నాడు. అదే సమయంలో గంగాధర్‌తో ఎలాంటి ముఖపరిచయం లేని యాడికి గ్రామానికి చెందిన మహేష్ అక్కడకు చేరుకుని తనకూ తాగేందుకు మద్యం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇందుకు గంగాధర్ నిరాకరించడంతో మహేష్ వాగ్వాదానికి దిగాడు. దుర్భాషలాడుతూ ఆ పక్కనే పడి ఉన్న ఖాళీ మద్యం గాజు బాటిల్ తీసుకుని గంగాధర్ తలపై బలంగా బాదాడు. దీంతో గంగాధర్ తలకు తీవ్ర రక్తగాయమైంది. సమాచారం అందుకున్న గంగాధర్ సమీప బంధువు అక్కడకు చేరుకుని వెంటనే క్షతగాత్రుడిని స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స చేయించాడు. విషయం తెలుసుకున్న యాడికి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దాడికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహేష్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

పేలుడు పదార్థం తిని గొర్రె మృతి

ఎన్పీ కుంట: అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన పేలుడు పదార్థం తిని ఓ గొర్రె మృతి చెందింది. ఎన్పీ కుంటకు చెందిన గొర్రెల కాపరి భాస్కర్ సోమవారం ఉదయం తన గొర్రెలను రోడ్డుకు సమీపంలోని చవట గుంతల వద్ద మేపుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటనపై గొర్రెల కాపరులు ఆందోళన వ్యక్తం చేశారు. జీవాలు మేపు సమయంలో నల్లమందు ఉంటలపై కాలు పెట్టినా పేలుడు ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటుందన్నారు.

ఒత్తిళ్లు అధిగమించేలా..

- ఇంటర్, బీటెక్ విద్యా ప్రణాళికలు విభిన్నం
- దీంతో ఇంజినీరింగ్ కష్టమనే అపోహ
- అపోహలు తొలగిపోయేలా విద్యార్థులకు ముందస్తుగా కౌన్సెలింగ్

జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో అనుబంధ కళాశాలలు	90
బీటెక్‌లో ఏటా ప్రవేశాలు	25 వేలు
ఫార్మసీ కోర్సుల్లో ఏటా ప్రవేశాలు	4 వేలు



అనంతపురం: ఇంజినీరింగ్ కష్టమనే అపోహను విద్యార్థుల్లో తొలగిపోయేలా మానసికంగా సంసిద్ధం చేయాలని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఆదేశించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. కాగా, ఐఐటీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో చోటు చేసుకున్న విద్యార్థుల ఆత్మహత్యలను పరిగణనలోకి తీసుకుని గత రెండేళ్లుగా ఏఐసీటీఈ జరిపిన అధ్యయనాల్లో బోధనా ప్రణాళికతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్న విషయం వెల్లడైంది. జాతీయ విద్యా విధానంలో వస్తున్న మార్పులపై తొలి దశలోనే అవగాహన కల్పించకపోవడమే ఇందుకు కారణంగా గుర్తించి ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో కూడిన విధానం అందుబాటులోకి తెచ్చేలా మార్గదర్శకాలను జారీ చేశారు. ఇంజినీరింగ్ రెండో ఏడాది నుంచే పారిశ్రామిక సంస్థల భాగస్వామ్యంతో పాఠ్య ప్రణాళికలో మార్పు చేశారు. దీంతో ఇంజినీరింగ్ విద్యార్థులు మూస విధానం నుంచి బయటపడి స్వతహాగా ఆలోచించే విద్యా విధానంలో అడుగుపెట్టేందుకు మార్గం సుగమమైంది. అయితే ఇది కూడా మానసిక ఒత్తిళ్లకు కారణమవుతోందని ఏఐసీటీఈ జరిపిన మరో అధ్యయనంలో తేలింది. దీంతో తరగతుల ప్రారంభానికి ముందే అన్ని విధాలుగా విద్యార్థులను సంసిద్ధులను చేసే దిశగా చర్యలు తీసుకున్నారు.

బ్యాక్‌లాగ్స్ భారమై..

ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు కేవలం 18 నుంచి 20 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులవుతున్నారు. సింహభాగం విద్యార్థులు మొదటి సంవత్సరంలోనే ఫెయిల్ అవుతున్నారు. ఇంటర్మీడియట్ విద్యా ప్రణాళిక, బీటెక్ విద్యా ప్రణాళిక విభిన్నంగా ఉండడమే ఇందుకు కారణం. ఇంటర్మీడియట్ వరకు బట్టీ పద్ధతిలో చదువుతున్నారు. ఇంజినీరింగ్‌లో బట్టీ విధానం ఉండదు. కంప్యూటర్ సైన్స్‌లో గణితం ఒక్కసారిగా మారిపోతుంది. రెండో ఏడాదికి వచ్చే సరికి అనేక కంప్యూటర్ లాంగ్వేజ్‌లను విద్యార్థులు నేర్చుకోవాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా ప్రయోగాత్మకంగా ఫలితాలూ సాధించాల్సి ఉంటుంది. సివిల్, మెకానికల్‌లోనూ ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంటుంది. వ్యక్తిగతంగా స్కిల్ పెంచుకుంటే తప్ప ముందుకెళ్లని పరిస్థితి. ఈ కారణంగా బీటెక్ మొదటి, రెండో సంవత్సరాల విద్యార్థులకు బ్యాక్‌లాగ్స్ ఎక్కువగా ఉంటున్నాయి. ఇదే వారి మానసిక ఒత్తిళ్లకు కారణమవుతోంది.

అధునాతన కోర్సులకు అధ్యాపకుల కొరత..

పోటీ ప్రపంచానికి దీటుగా కంప్యూటర్ సైన్సెస్ కోర్సు, దాని అనుబంధ కోర్సులకు విపరీతమైన క్రేజీ ఏర్పడింది. గత మూడేళ్లుగా డేటా సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఈ కోర్సులు బోధించే అధ్యాపకుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఈ అంతరాన్ని పూడ్చడానికి రెండో ఏడాది నుంచే సంబంధిత రంగాల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ వచ్చేలా ప్రాజెక్టులు పూర్తి చేయాలనే నిబంధన విధించారు. దీంతో ఏటా మార్కెట్‌లోకి వస్తున్న విద్యార్థుల్లో కేవలం 8 శాతం మంది మాత్రమే నైపుణ్యత కలిగి ఉంటున్నారని పారిశ్రామిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఫలితంగా ప్రతి ఆరు నెలలకోసారి విద్యార్థి మానసిక ధోరణిని పరిశీలించాలని ఏఐసీటీఈ సూచించింది.

విద్యార్థుల శ్రేయస్సుపై ప్రత్యేక దృష్టి

విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఇంజినీరింగ్ విద్యా ప్రణాళికపై తరగతుల ప్రారంభానికి ముందే వారిలో అవగాహన పెంచేలా చర్యలు తీసుకున్నాం. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అన్ని విధాలుగా విద్యార్థులను తీర్చిదిద్దుతాం.

– హెచ్.సుదర్శనరావు, వీసీ, జేఎన్‌టీయూ(ఏ)

క్యాంపస్ కళాశాలలో సీట్ల పెంపుదలకు కసరత్తు

జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రస్తుతం ఒక్కో బ్రాంచ్‌కు 60 సీట్లు ఉండగా, వీటిని 120కు పెంచేలా పాలక మండలి సభ్యులు ఆమోదం తెలిపారు. సోమవారం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ హెచ్ .సుదర్శనరావు అధ్యక్షతన పాలకమండలి సమావేశం జరిగింది. అలాగే స్నాతకోత్సవం నిర్వహణపై కూడా పాలకమండలి ఆమోదం తెలిపింది. పులివెందుల కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు వర్సిటీనే నిధులు అందించేలా చర్యలు తీసుకున్నారు.

ఫేక్ సర్టిఫికెట్లపై ముమ్మర విచారణ

- సర్టిఫికెట్లను అందజేయాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఆదేశాలు

తాడిపత్రి రూరల్: ఉమ్మడి జిల్లాలోని ఐసీడీఎస్ కార్యాలయాల పరిధిలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సంబంధించిన ఫేక్ సర్టిఫికెట్లపై విచారణ వేగవంతమైంది. తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టులో ప్రారంభమైన ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా విచారణకు కారణమైంది. ప్రకాశం జిల్లాలోనూ ఇదే తరహాలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందినట్లుగా గుర్తించారు. దీంతో ఉద్యోగంలో నుంచి తొలగిస్తారనే భయంతో తాడిపత్రి ప్రాజెక్టులో మాదిరిగా కొందరు హైకోర్టుకు వెళ్లడంతో ఐసీడీఎస్ డైరెక్టరేట్‌కు తలనొప్పిగా మారింది. దీంతో ఈ వివాదానికి చెక్‌పెట్టేలా సమగ్ర విచారణ బాధ్యతను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అప్పగించారు. దీంతో రాష్ట్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఉద్యోగంలో చేరిన సమయంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమర్పించిన నకళ్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు.. వాటిని సరిపోల్చుకునేందుకు ఒరిజనల్ సర్టిఫికెట్లు సంబంధిత ఐసీడీఎస్ కార్యాలయాల్లో స్వయంగా అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల మేరకు తొలుత ఒరిజనల్ సర్టిఫికెట్లను స్వీకరించిన సీడీపీఓలు వాటిని స్కాన్ చేసి ఆన్‌లైన్ ద్వారా డైరెక్టరేట్‌కు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. విచారణలో ఫేక్ సర్టిఫికెట్లను సమర్పించిన వారిని ఉద్యోగంలో నుంచి తొలగించడమే కాక వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

19న వివాహం... యువతి బలవన్మరణం

- పెళ్లి భజంత్రీ మోగాల్సిన ఇంట విషాదం
- మృతురాలు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్


రేణుక మృతదేహం

రాప్తాడు రూరల్: పెళ్లి భజంత్రీ మోగాల్సిన ఇంట కాబోయే పెళ్లికూతురు బలవన్మరణంతో తీవ్ర విషాదం నెలకొంది. అనంతపురం రూరల్ మండలం పూలకుంటలో సోమవారం జరిగిన ఈ ఘటన కలకలం రేపుతోంది. పోలీసులు తెలిపిన మేరకు... పూలకుంట గ్రామానికి చెందిన కురుబ నారాయణస్వామికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పెద్దమ్మాయికి వివాహమైంది. రెండో అమ్మాయి రేణుక (24) ఆకుతోటపల్లి–1 సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తోంది. ఈమెకు ఓ ప్రభుత్వ ఉద్యోగితో పెద్దలు పెళ్లి నిశ్చయించారు. ఈ నెల 19న పెళ్లి జరగాల్సి ఉంది. ఇందుకోసం ఏర్పాట్లు చకాచకా జరుగుతున్నాయి. కుటుంబసభ్యులు ఓవైపు పెళ్లి పత్రికల పంపిణీ చేస్తూనే మరోవైపు పెళ్లికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంటికి బంధువుల రాక కూడా మొదలైంది.

పెళ్లంటే ఇష్టం లేక....

అయితే రేణుకకు పెళ్లంటే ఇష్టం లేదు. ఇదే విషయాన్ని పలుమార్లు సచివాలయంలో సహచర ఉద్యోగులతో చెప్పేది. 'పెళ్లి చేసుకున్న తర్వాత జీవితం ఎలా ఉంటుందో...అత్త మామలు ఎలా ఉంటారో....ఇప్పుడున్నట్లు పెళ్లి చేసుకున్న తర్వాత ఉండేందుకు ఉండదు... కొత్తగా పెళ్లి చేసుకున్న వారి కాపురాలు చాలా చూస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో పెళ్లి ఎందుకు చేసుకోవాలో?' అని చర్చించేది. మరోవైపు పెళ్లి తేదీ దగ్గరకు వస్తుండడంతో హడావుడి పెరిగిపోయింది. ఇక పెళ్లి చేసుకోవాల్సి వస్తుందని, తల్లిదండ్రులకు చెప్పుకోలేక తీవ్ర ఆందోళనకు గురైన ఆమె సోమవారం ఉదయం మేడపై ఉన్న గదిలోకి వెళ్లి తలుపు వేసుకుని ఫ్యానుకు ఉరి వేసుకుంది. ఎంతసేపటికీ కిందకు రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు పైకి వెళ్లి చూడగా ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమార్తె కనిపించింది. సమాచారం అందుకున్న ఇటుకలపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- అంబేడ్కర్ ఆశయాలను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం
- ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం
- వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన భారత రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం కాలరాస్తూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అనంతపురం నగర పాలక సంస్థ మేయర్ వసీం ధ్వజమెత్తారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సోమవారం పార్టీ శ్రేణులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కక్ష సాధింపులు, దౌర్జన్యాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్రంలో అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగించారన్నారు. అన్నివర్గాల అభ్యున్నతికి వైఎస్ జగన్ పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. రూ.2.75 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమ చేయడం ద్వారా పేదరికం నిర్మూలనకు కృషి చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. పారదర్శకత, అవినీతిరహిత పాలనను జగనన్న అందిస్తే.. ఇందుకు విరుద్ధంగా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ కూటమి సర్కార్ పాలన సాగుతోందని మండిపడ్డారు. రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమం అనంతరం జెడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, అనుబంధ విభాగాల రాష్ట్ర నాయకులు కాగజ్‌ఘర్ రిజ్వాన్, పెన్నోబులేసు, కృష్ణవేణి, వేముల నదీం, అనుబంధ సంఘాల అధ్యక్షులు మల్లెమీద నరసింహులు, వైపీ బాబు, శ్రీదేవి, సైపుల్లాబేగ్, అమర్‌నాథ్ రెడ్డి, చంద్రలేఖ, నాయకులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, వెన్నపూస రామచంద్రారెడ్డి, మీసాల రంగన్న, పసులూరు ఓబులేసు, దాదు, తలారి వెంకటేష్, మారుతీనాయుడు, తనీష, మాల్యవంతం మంజుల, ఫయాజ్, సతీష్, లక్ష్మణ్, శోభారాణి , శోభాబాయి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, దుర్గాదేవి, రహంతుల్లా, రాజేశ్వరి పాల్గొన్నారు.

టీడీపీ నేతపై హత్యాయత్నం


చికిత్స పొందుతున్న సోమన్నగౌడ్

బొమ్మనహాళ్: మహిళ పరువు తీశాడన్న కక్షతో టీడీపీ నేతపై బాధితురాలి సంబంధీకులు కత్తితో దాడి చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం కల్లుహోళ గ్రామానికి చెందిన టీడీపీ నేత సోమన్నగౌడ్... అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో గుట్టుగా వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. ఈ విషయం వెలుగు చూడడంతో కొన్నేళ్ల క్రితం పెద్ద మనుషుల పంచాయితీ నిర్వహించి ఇద్దరినీ మందలించారు. ఇటీవల సోమన్నగౌడ్ మళ్లీ ఆమెతో మాట్లాడుతుండడం సదరు మహిళ మేనల్లుడు గోవిందు గమనించాడు. దీంతో గ్రామంలో తమ మేనత్త పరువు తీయడమే కాక మళ్లీ ఆమెతో సన్నిహితంగా మెలిగేందుకు ప్రయత్నిస్తుండడాన్ని జీర్ణించుకోలేక అదే గ్రామానికి చెందిన బి.వన్నప్పతో కలసి ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటల తర్వాత తన ఇంటి ఎదుట నిద్రిస్తున్న సోమన్నగౌడ్‌పై కత్తితో దాడి చేశాడు. ఆ సమయంలో సోమన్నగౌడ్ దాడిని ప్రతిఘటిస్తూ గట్టిగా కేకలు వేయడంతో కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారు మేల్కొనడంతో గోవిందు, వన్నప్ప అక్కడి నుంచి పారిపోయారు. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు.

అంబేడ్కర్ జయంతి వేడుకల్లో అపశ్రుతి


నాగరాజు (ఫైల్)

ఉరవకొండ: పట్టణంలో సోమవారం నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో దళిత సంఘం నాయకుడు, పెద్ద ముష్టూరు గ్రామానికి చెందిన నాగరాజు (49) గుండెపోటుతో మృతి చెందాడు. ముందుగా ర్యాలీలో పాల్గొన్న ఆయన అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తుండగా ఒక్క సారిగా ఛాతి పట్టుకుని కుప్పకూలాడు. గమనించిన నాయకులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. నాగరాజు మృతిపై దళిత సంఘం నాయకులు, ఉద్యోగ జేఏసీ నాయకులు సంతాపం తెలిపారు.

పెనుగాలుల బీభత్సం


కల్లూరు వద్ద జాతీయ రహదారిపై కూలిన హోర్డింగ్‌ను తొలగిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నెతో పాటు కల్లూరులో సోమవారం సాయంత్రం పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. కల్లూరులో 44వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన హోర్డింగ్ కూలి రోడ్డు మీద పడింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు రాకపోకలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. అలాగే గార్లదిన్నెలోని డ్యాం రోడ్డు రైల్వే గేట్ వద్ద పురాతన వేపవృక్షం విరిగి పడింది. గ్రామాల్లోని పలు తోటల్లో చెట్లు విరిగి పడినట్లు రైతులు తెలిపారు.

పామిడిలో గాలీవాన

పామిడి: మండల కేంద్రం పామిడిలో సోమవారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించాయి. ఒక్కసారిగా బలమైన గాలులు వీయడంతో ఇళ్ల రేకులు, పీఓపీ సీట్లు ఎగిసి పడ్డాయి. రేకుల షెడ్ల నేల కొరిగాయి.

జాతీయ హోమియో వైద్యుల సంఘంలో జిల్లా వాసులకు చోటు



డా॥ పోగుల కుమారయ్య, డా॥ శాంతిప్రియ

అనంతపురం మెడికల్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు దక్కింది. ఈ నెల 13న గుంటూరులో అఖిల భారత హోమియో వైద్యుల సంఘం 18వ రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన సీనియర్ హోమియోపతి వైద్యుడు డాక్టర్ పోగుల కుమారయ్య, రాష్ట్ర విభాగం కో ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎం.శాంతిప్రియకు అవకాశం దక్కింది. డాక్టర్ పోగుల కుమారయ్య మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో హోమియో వైద్యం ప్రాముఖ్యత, నూతన ఆవిష్కరణలు, సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

నగదు అపహరణ కేసులో నిందితుడి అరెస్ట్

నార్పల: నగదు అపహరణ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నార్పల పీఎస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ వెల్లడించారు. గతేడాది అక్టోబర్‌లో వెంకటాంపల్లికి చెందిన శ్రీనివాసులు, తన భార్యతో కలసి నార్పలలోని స్టేట్‌బ్యాంకులో ఉన్న తన ఖాతా నుంచి రూ.3 లక్షలు డ్రా చేసి ద్విచక్ర వాహనంలోని బ్యాగ్‌లో ఉంచుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలో నార్పల సంతలో నిత్యావస సరుకులు తీసుకునేందుకు వాహనాన్ని ఆపాడు. ఆ సమయంలో చిన్నా అనే యువకుడు నగదు అపహరించాడు. ఘటనపై అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసుల కళ్లుగప్పి సంచరిస్తున్న చిన్నాను.. సోమవారం నార్పల క్రాస్ సమీపంలో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణం పోసిన మెడిసిన్ వైద్యులు


కోలుకున్న నాగేంద్రకు సేవలందిస్తున్న స్టాఫ్‌నర్సులు (చిత్రంలో) భార్య సుకన్య

అనంతపురం మెడికల్: ప్రాణాపాయ స్థితిలో చికిత్స ఆస్పత్రికి చేరుకున్న రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం ద్వారా అతని ప్రాణాలను ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని మెడిసిన్ విభాగం వైద్యులు కాపాడారు. కంబదూరు మండలం ఒంటిరెడ్డిపల్లికి చెందిన 34 ఏళ్ల వయసున్న నాగేంద్ర.. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఉన్నఫళంగా కాళ్లు చేతులు పడిపోయి, మాట రాకపోవడంతో ఈ నెల 7న కుటుంబసభ్యులు సర్వజనాస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు అక్యూట్ మెడికల్ కేర్‌లో అడ్మిట్ చేసుకుని మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ భీమసేనాచార్ నేతృత్వంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పావని తదితరులు చికిత్స మొదలు పెట్టారు. గులియన్ బరీ సిండ్రోమ్‌తో బాధపడుతున్నట్లుగా నిర్ధారణ అయిన తర్వాత పీజీ వైద్యులు, స్టాఫ్‌నర్సులు నాగేంద్రకు రౌండ్ ద క్లాక్ సేవలందించారు. రూ.7వేలు విలువ చేసే ఇంజెక్షన్లను క్రమం తప్పకుండా 20కి పైగా అందించాల్సి వచ్చింది. వెంటిలేటర్‌పై ఉన్న నాగేంద్ర కోలుకోవడంతో వార్డుకు షిఫ్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. తమకు ముగ్గురు పిల్లలున్నారని, ఆస్పత్రి వైద్యులు తన భర్తకు ఊపిరి పోశారని, వారి మేలును ఎన్నడూ మరవనంటూ వైద్యులు, స్టాఫ్‌నర్సులు, తదితర సిబ్బందికి భార్య సుకన్య కృతజ్ఞతలు తెలిపింది. ప్రైవేట్‌గా ఈ తరహా వైద్యం పొందాలంటే రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుందని ఆస్పత్రి వైద్యులంటున్నారు.

అంబేడ్కర్ కాలనీ నేమ్‌బోర్డు ఏర్పాటుపై ఉద్రిక్తత


దళితులతో ఘర్షణకు దిగిన కూటమి నాయకులు

రాయదుర్గం టౌన్: మండలంలోని రాయంపల్లి ఎస్సీ కాలనీ ప్రవేశ మార్గంలో 'అంబేడ్కర్ కాలనీ' నేమ్ బోర్డు ఏర్పాటుపై సోమవారం ఉద్రిక్తత నెలకొంది. గ్రామానికి చెందిన కొందరు కూటమి నాయకులు నేమ్‌బోర్డును దౌర్జన్యంగా పెకలించారు. ఆ సమయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. జిల్లా కలెక్టర్‌గా గంధం చంద్రుడు పనిచేసిన సమయంలో దళిత, ఎస్సీ కాలనీలను ఆ పేర్లతో పిలవకూడదన్న ఉద్దేశంతో జాతీయ నాయకుల పేర్లతో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయించారు. ఈ నేపథ్యంలోనే రాయంపల్లి ఎస్సీ కాలనీకి 'అంబేడ్కర్ కాలనీ'గా నామకరణం చేసి నేమ్‌బోర్డు ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు బోర్డు పడిపోవడంతో కొందరు యువకులు మరమ్మతు చేయించి.. అంబేడ్కర్ జయంతి రోజున అదే స్థలంలో మళ్లీ ఏర్పాటు చేశారు. దీనిని జీర్ణించుకోలేని గ్రామానికి చెందిన కొందరు కూటమి నాయకులు దళితులతో ఘర్షణకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని గొడవను సద్దుమణిగించారు. కాగా, 'అంబేడ్కర్ కాలనీ' నేమ్‌బోర్డు ఏర్పాటు చేస్తే అంతు చూస్తామంటూ కులం పేరుతో దూషించి న కూటమి పార్టీల నాయకులు శీనప్ప, మద్దానప్ప, హనుమంతప్ప, జయన్న, ఆంజనేయులు, బోయ దొడ్డపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు దళితులు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తిప్పేరుద్ర, వన్నూరుస్వామి, కిష్టప్ప, రుద్రన్నతో పాటు మరో 12 మంది డిమాండ్ చేశారు.

లారీల ఢీ – డ్రైవర్ మృతి

కళ్యాణదుర్గం రూరల్: రెండు లారీలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం వైపు నుంచి బండల లోడుతో ఆదివారం అర్ధరాత్రి కళ్యాణదుర్గం వైపు వస్తున్న లారీ కాలువపల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన మరో లారీ ఢీకొంది. ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ రజినీస్ బయాస్(50) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో లారీ డ్రైవర్‌తో పాటు రెండు వాహనాల క్లీనర్లూ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న వాహనదారులు గమనించి క్షతగాత్రులను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

- ఘనంగా అంబేడ్కర్ జయంతి
- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు
- పలుచోట్ల ఆకట్టుకున్న ర్యాలీలు

అనంతపురం సిటీ: నవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యావత్ ప్రపంచానికి ఆదర్శనీయుడని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన జయంతి సభలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నవ భారత నిర్మాణంలో అంబేడ్కర్ పోషించిన పాత్ర అసాధారణమైందన్నారు. కార్యక్రమంలో ఏఓలు విజయ భాస్కర్‌రెడ్డి, షబ్బీర్ నియాజ్, రత్నాబాయి, శ్రీవాణి, మహబూబ్ వలి, ధనుంజయ, నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ అరుణ కుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో..

అనంతపురం మెడికల్: ప్రపంచంలోనే అత్యంత మేధావి అంబేడ్కర్ అని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరళ, వైద్యులు డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ నిహారిక, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ అనిల్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ సర్వజనాస్పత్రి, డీఎంహెచ్ఓ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

నగరపాలక సంస్థలో..

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మేయర్ వసీం పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో..

అనంతపురం సిటీ: అనంతపురంలోని వేమన భవన్ (బీఎస్ఎన్ఎల్ కార్యాలయం) ఆవరణలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎస్ఈడబ్ల్యూఏ) జిల్లా అధ్యక్షుడు గోపాల్ పూలమాలలునివాళులర్పించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన ముగ్గురికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి రామచంద్ర, రాజా రమేశ్, రామమూర్తి నాయక్, తిప్పన్న, వాల్యా నాయక్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

అనంతపురం అర్బన్: మనువాదులు, మతోన్మాద శక్తుల చర్యల కారణంగా రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, నాయకులు రాజు, నారాయణ, కృష్ణా నాయక్, శివకృష్ణ, దుర్గాప్రసాద్, నాగరాజు, రమేష్, వెంకటేష్, హస్మత్‌బీ పాల్గొన్నారు.

రాప్తాడులో..

రాప్తాడు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మాజీ కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దండు రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సాకే బాల నాగేంద్ర, మాజీ డీలర్ లక్ష్మన్న, సాకే ఓబులేష్, నాగప్ప, ముత్యాలు, కృష్ణమూర్తి, పలు పార్టీల నాయకులు గోనిపట్ల శీన, అద్ర పురుశ్‌రాముడు, దండు శంకర్, దండు ప్రసాద్, శీల్ల ఉజ్జినప్ప పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: మండల కేంద్రంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, నాగరాజు, వన్నూరప్ప, వెంకటేష్, సర్దానప్ప, మల్లయ్య, సోము, ఓటీ టైలర్ వెంకటేష్, పెద్దన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.


అనంతపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో..

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పసలూరు ఓబిలేసు, చంద్రచర్ల హరి, శంకర కుళ్లాయప్ప, పూసల హనుమంతు, రామకృష్ణ, సూర్యనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఫోరం నాయకుల ఆధ్వర్యంలో..

ఎస్సీ, ఎస్టీ ఫోరం నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్లన్న, రామాంజనేయులు, ఎర్రిస్వామి, ప్రభాకర్, మంజునాథ్, నాగేష్, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

ఆర్ఈఎఫ్ ఆధ్వర్యంలో..

ఆర్ఈఎఫ్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ నాయక్, శ్రీనివాసులు, ఓబులేసు, రాజశేఖర్, శ్రీరాములు, మల్లికార్జున, ఈశ్వరయ్య, వరప్రసాద్, వరదరాజులు, జయరాములు, వెంకటరాముడు, నారాయణ, రామలింగయ్య పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో..

ఎంఈఎఫ్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శ బండారు శంకర్, కదిరప్ప, హరి గోపాల్, అమర్‌నాథ్, గంగాధర్, చంద్రశేఖర్, నాగభూషణం, రమేష్, శీనా, అశోక్ కుమార్, రామన్న, వెంకటేశులు పాల్గొన్నారు.

ఏపీ ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఏపీ ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. జయరాం, రాజా రమేష్, శాంతి ముని, ప్రకాష్ బాబు, సునీల్ కుమార్, స్వరూప్, నరసింహులు, రామాంజినమ్మ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, శాంతకుమార్, రత్నమయ్య, లలిత్ కుమార్, వెంకటేశ్వర రెడ్డి, లక్ష్మీదేవమ్మ, అశోక్ రెడ్డి, శివశంకర్, ప్రభుకుమార్, సూర్య, నాగేంద్ర, మలోబులు, మజునాథ్, అంజి బాబు, రవి, చక్రధర్, దిలీప్, ఆదినారాయణ, లక్ష్మణ్, రాందాసు, మనోహర్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఆల్‌మేవా ఆధ్వర్యంలో..

ఆల్‌మేవా జిల్లా అధ్యక్షుడు షేక్షావలి, అస్రఫ్ అలీ, ఫరూక్, హిదయతుల్లా, అన్వర్, జీలాన్, ఇమ్రాన్, మాఖ్బూల్, అబ్దుల్ రసూల్ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.


మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్య రావు

ఆర్ట్స్ కళాశాలలో..

అనంతపురం ఎడ్యుకేషన్: రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మశ్రీ మాట్లాడుతూ లెజెండరీ వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు జయలక్ష్మి, విష్ణుప్రియ, రామకృష్ణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

రాప్తాడురూరల్: అంబేడ్కర్ అందరివాడు అని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. సోములదొడ్డి వద్ద పరిటాల శ్రీరామ్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్, సూర్యనారాయణ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

రాప్తాడురూరల్: సామాజిక సమానత్వానికి బలమైన పునాది వేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు రమణ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం అనంతపురం రూరల్‌తో పాటు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు ముబ్బుకొట్టాల అక్కులన్న, కుంటన్న, నాగరాజు, మల్లికార్జున, ఓబులేసు, కొల్లప్ప, చిట్టి పెద్దన్న పాల్గొన్నారు.

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) పాలక భవనం, ఎస్కేయూలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జేఎన్‌టీయూ(ఏ) వీసీ సుదర్శన రావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అనిత, రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.కృష్ణకుమారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీస్ ప్రతినిధి డాక్టర్ సి.చంద్రయ్య, సదస్సు కన్వీనర్, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య పాల్గొన్నారు. మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేకన్న ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దాం

అనంతపురం సెంట్రల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉప రవాణా కమిషనర్ వీర్రాజు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా రవాణాశాఖ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేడ్కర్ సేవలు ఎనలేనివని కొనియాడారు. రాజ్యాంగం ద్వారానే నేడు అందరికీ సమానహక్కులు, న్యాయం పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీఓలు సురేష్ నాయుడు, రమేష్, ఎంవీఐలు శ్రీనివాసులు, సునీత తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో..

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెక్రటరీలు కె.గోవిందు, రూప్ కుమార్, సూపర్‌వైజర్లు కేశవకుమార్, నాగేంద్ర ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


జెడ్పీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఉద్యోగులు


రాప్తాడులో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


ఆత్మకూరు మండల కేంద్రంలో..


బహుమతి అందజేస్తున్న బీఎస్ఎన్ఎల్ జీఎం ముజీబ్ పాషా


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీటీసీ వీర్రాజు


అంబేడ్కర్ చిత్రపటానికి నమస్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు


అంబేడ్కర్ గొప్పతనాన్ని వివరిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ

క్లుప్తంగా

అశ్వవాహనంపై సీతారాముల దర్శనం


అశ్వవాహన సేవల్లో సీతారాములు

అనంతపురం కల్చరల్: ఒంటిమిట్ట క్షేత్రాన్ని తలపిస్తూ స్థానిక మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో సాగుతున్న శ్రీరామ నవమి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. వాహన సేవల్లో భాగంగా సోమవారం రాత్రి సీతారాములను అశ్వవాహనంపై ఊరేగించారు. గ్రామీణ ప్రాంతాల కళాకారుల సామూహిక భజనలు, భక్తిసంకీర్తనలు, వేద మంత్రాల నడుమ సీతా సమేత కోదండ రాముడు పూజలందుకున్నాడు. ఈ సందర్భంగా భక్తమండలి సభ్యులు మాట్లాడుతూ.. తొమ్మిది రోజుల పాటూ భక్తిభావాన్ని నింపిన ఉత్సవాలు మంగళవారం వసంతోత్సవంతో ముగుస్తాయని తెలిపారు. ముగింపు సందర్భంగా భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకోవాలని కోరారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

అనంతపురం అర్బన్: హంద్రీ–నీవా కాలువ వెడల్పు, లైనింగ్ పనుల నిలుపుదల, ప్రాజెక్టుకు 40 టీఎంసీల నీటి కేటాయించాలనే డిమాండ్‌తో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపటనున్నట్లు ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.నాగముత్యాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు క్లాక్ టవర్ వద్ద ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. అక్కడ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నా చేస్తామని వెల్లడించారు. అనంతరం వివిధ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు.

ఓపీల్లో ప్రొఫెసర్ సేవలు


గైనిక్ ఓపీలో మహిళలను పరీక్షిస్తున్న హెచ్ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కొన్ని విభాగాల్లో ప్రొఫెసర్లు వార్డులతో పాటు ఓపీల్లోనూ సేవలందిస్తున్నారు. కొంత మంది ప్రొఫెసర్లు వార్డుల్లో రౌండ్స్ వేసుకుని అనంతరం ఓపీల్లో షిఫ్ట్‌ల ప్రకారం సేవలందించడం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఆస్పత్రిలోని గైనిక్, ఆర్థో, మెడిసిన్ తదితర ఓపీల్లో ప్రొఫెసర్లు అందుబాటులో ఉంటున్నారు. ఇదే స్ఫూర్తిని మిగతా విభాగాలు పాటిస్తే బాగుంటుందని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. సర్జరీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, పల్మనాలజీ, డెంటల్ తదితర విభాగాల్లో సంబంధిత ప్రొఫెసర్లు పత్తా లేకుండా పోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

'పాలస్తీనా జెండాతో ర్యాలీ చేసిన వారిని అరెస్ట్ చేయాలి'


ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఈనెల 13న అనంతపురంలో నిర్వహించిన ర్యాలీలో పాలస్తీనా జెండాను ప్రదర్శనకు పెట్టిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. పాలస్తీనా జెండా పట్టుకుని నిరసన తెలిపిన వారి వివరాలు సేకరించి వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ రాజేష్, మాజీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, రత్నమయ్య, వెంకటేశ్వర రెడ్డి, దేవి రెడ్డి లక్ష్మీదేవి, కిరణ్ గౌడ్, లలిత్ కుమార్, అశోక్ రెడ్డి, అంజిబాబు, దామోదర్, రంజిత్, చైతన్య, రాజేష్, శాంతకుమార్, ప్రభు, నాగేంద్ర, సూర్యప్రకాష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి


సీఐ, ఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

చెన్నేకొత్తపల్లి: పల్నాడు జిల్లా మాచెర్ల మండలంలో వ్యక్తి హత్యకు సంబంధించి వారి కుటుంబ సభ్యుల కథనం మేరకు సాక్షి దిన పత్రికలో కథనం ప్రచురితమైతే పత్రిక సంపాదకుడు ధనుంజయరెడ్డితో పాటు మరో ఆరుగురు జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమని పాత్రికేయులు మండిపడ్డారు. అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రామగిరి సీఐ శ్రీధర్, చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు ఇలియాజ్, మురళీధర్, ప్రవీణ్‌కుమార్.రామకృష్ణ, మహానందరెడ్డి, నాగేంద్ర, నారాయణ స్వామి, షమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి

అనంతపురం టవర్ క్లాక్: రైతులు తీసుకున్న పంట రుణాలకు కేవలం వడ్డీ మాత్రమే కట్టించుని రెన్యూవల్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు ఏపీ రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. బ్యాంకుల వద్ద తాగు నీటి వసతి కల్పించాలని సూచించారు. సర్క్యులర్స్‌ను తెలుగుతో ముద్రించి నోటీసు బోర్డులో పెట్టేలా చూడాలన్నారు. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలన్నారు. తాకట్టు లేకుండా రూ.5 లక్షల వరకూ రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాయుడు, క్రిష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విషు పర్వదిన వేడుకలు


అలంకరణలో మణికంఠుడు

అనంతపురం కల్చరల్: కేరళ సంప్రదాయంలో నూతన సంవత్సరాదిగా జరుపుకునే విషు పర్వదిన వేడుకలు ఘనంగా సాగాయి. పాతూరు చెరువుకట్టపై వెలసిన శ్రీసాయి అయ్యప్ప సేవా సమాజంలో సోమవారం ఉదయం ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతమ్ ఆధ్వర్యంలో హరిహరసుతుడికి ప్రత్యేక పుష్పాలంకారం చేసి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఆదివారం రాత్రి దాదాపు 500 మంది భక్తులు నిద్రించి సోమవారం తెల్లవారుజామున అయ్యప్ప స్వామి దర్శనం చేసుకున్నారు. ప్రాతఃకాల దర్శన పూజల్లో పాల్గొన్న వారందరికీ స్వామివారి కానుకగా రూపాయి నాణేలు అందించారు. వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన ఆర్వో శుద్ధనీటి జలాలు, అన్నప్రసాదాలను వితరణ చేశారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణితో పాటూ గురుస్వాములు వీరాంజనేయులు, రంగాచారి, పార్థసారథి, వెంకటనారాయణ తదితరులు పూజల్లో పాల్గొన్నాయి. విషు పండుగ విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో నాగానందం, రాము, కేశవ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

అనంతపురం అర్బన్: దళిత వాడల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని నాయకులు హెచ్చరించారు. కేవీపీఎస్, ఐద్వా, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా చేపట్టిన చైతన్య యాత్ర ముగింపు సభ సోమవారం స్థానిక అంబేడ్కర్ నగర్‌లో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఐద్వా జిల్లా నాయకురాలు చంద్రిక అధ్యక్షతన జరిగింది. సభలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడారు. ఈనెల 11న జ్యోతిబాపూలే జయంతి రోజున ప్రారంభించిన సామాజిక చైతన్య యాత్ర నాలుగు రోజుల పాటు 18 మండలాల పరిధిలోని 86 గ్రామాల్లోని దళిత కాలనీల్లో సాగిందన్నారు. దళిత కాలనీల్లో చాలా సమస్యలు ఉన్నాయన్నారు. ఇళ్ల స్థలాల సమస్య ఉందని తెలిపారు. ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేవని పేర్కొన్నారు. పలు దళిత కాలనీల్లో శ్మశాన వాటికలు లేవని గుర్తు చేశారు. మురుగు కాలువలు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇలా పలు సమస్యల మధ్య దళిత వాడల్లోని ప్రజలు జీవనం సాగిస్తున్నారన్నారు. సామాజిక యాత్రలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. వాటిని పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శకుంతలమ్మ, నాయకులు రామాంజినమ్మ, మసూద్, అక్కులప్ప, రాజా, నల్లప్ప, సిద్ధు, గిరి, భీమేష్, శ్రీనివాసులు, కృష్ణవేణి, పుల్లన్న, లక్ష్మీనారాయణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప

'వరప్రసాదరెడ్డి ఆరోపణలు అవాస్తవం'

అనంతపురం కల్చరల్: నగరంలోని గాస్పెల్ అసెంబ్లీ సంఘం నుంచి ఇద్దరిని బహిష్కరిస్తున్నట్లు పాస్టర్ వరప్రసాదరెడ్డి చెప్పడం హాస్యాస్పదం. తప్పుడు ఆరోపణలతో పరువుకు భంగం కలిగిస్తున్నందుకు దావా వేస్తున్నట్లు ఫిలిఫ్ తెలిపారు. సోమవారం ఆయన చర్చిలో జరుగుతున్న విషయాలను తెలియజేశారు. 2017లో రిజిస్టర్ అయిన సొసైటీ 7 మంది సభ్యుల్లో వరప్రసాదరెడ్డి సెక్రటరీగా ఉన్నారని.. అన్నింటికీ ఆయన సంతకాలు ఉన్నాయన్నారు. ఆయనతో పాటూ ఉండే రవికుమార్, వరప్రసాద్ సొసైటీ ఇల్లీగల్ అని కోర్టుకు వెళ్లారని.. కోర్టులో ఆయనకు అనుకూలంగా లేకపోవడంతో వేరే మార్గాలు వెతుక్కున్నారని గుర్తు చేశారు. ఆనాటి నుంచి నేటి వరకూ సొసైటీ అకౌంట్స్ వివరాలు చర్చిలో అందరి సమక్షంలో వినిపించామన్నారు. అరోరా అనే వ్యక్తికి రూ.లక్ష (చెక్కు రూపంలో) ఇచ్చి ఇంత వరకూ దానికి లెక్క సమాచారం తెలపలేదన్నారు. అలాగే 2018 వరకూ మోహన్ రావు, పురుషోత్తం సంఘం రాబడి వసూలు చేసి బ్యాంకులో జమ చేయలేదని పేర్కొన్నారు. రూ.15 లక్షలకు పైగా జమ చేయనందున పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అయితే మొదట డబ్బు విషయంలో తప్పు జరిగిందన్న వరప్రసాదరెడ్డి తర్వాత లెక్క సరిపోయిందని అని చెప్పడం వెనుక ఏమి జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ఆదినారాయణ, ఆసాపు ఇతరుల నుంచి డబ్బు వసూలు చేసినా వాటికి లెక్కలు లేవన్నారు. ఏపీజీబీలో సొసైటీ అకౌంట్ ద్వారా సాగిన లావాదేవీలు స్పష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు. కేవలం అడిగినప్పుడల్లా వరప్రసాద రెడ్డికి డబ్బులు ఇవ్వనందునే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దొంగదారిలో అధికారం చేపట్టిన వారి ఆరోపణలకు తగిన సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

అంబేడ్కర్ జయంతిలో ఫ్లెక్సీ వివాదం

అనంతపురం టవర్‌క్లాక్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిలో ఫ్లెక్సీ ఏర్పాటు విషయంలో సోమవారం వాగ్వాదం చోటుచేసుకుంది. వివిధ కుల సంఘాల నాయకులు అంబేడ్కర్‌పై అభిమానంతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఓ ఫ్లెక్సీలో కుల సంఘం నాయకులు గుడి కట్టడం కన్నా బడి కట్టడం మిన్న అంటు కొటేషన్ రాయించారు. అది చూసిన బీజేపీ నాయకులు ఫ్లెక్సీ తొలగించేందు వెళ్లారు. గమనించిన వివిధ కుల సంఘాల నాయకులు బీజేపీ నాయకులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఎంతో గొప్ప గొప్ప నాయకులు ఇలాంటి కొటేషన్స్ చెప్పారని.. అందులో తప్పు ఏముందని ప్రశ్నించారు. బీజేపీ, కుల సంఘాల నాయకుల మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలకు నచ్చచెప్పడంతో వివాదం సద్దుమనిగింది.

ఆలూరుకోనలో ఎస్పీ దంపతుల పూజలు

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆలూరు కోనలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ జగదీష్ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు వారికి స్థల పురాణం, ఆలయ విశిష్టత ను వివరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంధం వేడుకలు

పెద్దవడుగూరు: లక్ష్మంపల్లిలో సోమవారం పక్కీరప్ప స్వామి ఉరుసులో భాగంగా గంధం వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే గ్రామంలోని పురవీధుల గుండా స్వామి వారిని గుర్రం పై ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఉరుసు ముగుస్తుందని గ్రామస్తులు తెలిపారు.